

స్పందన దరఖాస్తులను పరిష్కరించండి: కలెక్టర్


అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 5: స్పందన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం వైఎస్సార్ సెంటనరీ హాల్లో స్పందనలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో 211 దరఖాస్తులు వచ్చాయి.


రుద్రవరం మండలంలోని నక్కలదిన్నె గ్రామ సమీపంలో బోరు నుంచి ధారలా వస్తున్న నీరు

తడారిన నేల

రుద్రవరం, ఫిబ్రవరి 5: రుద్రవరం వ్యవసాయానికి పెట్టింది పేరు. ఉమ్మడి జిల్లాలో సాగు నీరు, భూగర్భ జలాలు ఇక్కడ అందుతుంటాయి. అలాంటి చోటే వ్యవసాయం భయపెడుతోంది. బోరుబావుల కింద సాగు చేసిన పంట దిగుబడులు చేతికి వస్తాయా? అనే సందేహంలో రైతులు ఉన్నారు. ఈ ప్రాంత రైతులు కోటి ఆశలతో రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు, పండ్లు, పూల తోటలు సాగు చేశారు. కానీ భూగర్భజలం పాతాళానికి పడిపోయింది. వర్షాలు తగినంత కురవక నేల ఎండిపోయి మట్టి మనిషికి సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం తగ్గి వెలవెలబోతున్నాయి. నీటి కాల్వలు, వాగులు, వంకలలో నీటి గలగల సవ్వడులు నిలిచిపోయాయి.

వ్యవసాయ బోరుబావుల్లో ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా భూగర్భజలం అడుగంటింది. దీంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. సాగు చేసిన పంటలు ఎలా రక్షించుకోవాలని ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి మాసంలోనే బోరుబావుల్లో భూగర్భజలం పడిపోయింది. కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టారు. సాగునీరు లేకపోతే పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

- వ్యవసాయ బోరు బావుల్లో అడుగంటిన భూగర్భ జలం
- జిల్లాలో 1.70 లక్షల హెక్టార్లలో పంటలు సాగు
- 30 వేల ఎకరాల్లో పండ్ల తోటలు
- 1.20 లక్షల వ్యవసాయ బోరు బావులు
- పంట పొలాలు, తోటలు చేతికి రావని రైతుల ఆందోళన

1.20 లక్షల వ్యవసాయ బోరుబావులు

జిల్లాలో సుమారు 1.20 లక్షల వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. అధిక శాతం బోరుబావులపై ఆధారపడి రైతులు పంటలను సాగు చేస్తున్నారు. వర్షాలు సరిగ్గా లేకపోవడంతో ఈసారి ఫిబ్రవరి మాసంలోనే భూగర్భజలాలు అడుగంటాయి. బోరుబావులు నిలువునా ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను రక్షించుకోవడానికి రైతులు కొత్త బోరుబావులు కూడా తవ్వుతున్నారు.


నరసాపురంలో సాగు చేసిన పొగాకు పంట

1.70 లక్షల హెక్టార్లలో సాగు

జిల్లాలో ప్రధానంగా వరి అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. రబీ సీజన్‌లో మినుము, కంది, మిరప, పొగాకు, మొక్కజొన్న, సజ్జలు, వేరుశనగ, పెసలు, ఉలవలు, బంతిపూలు ఇంకా పలు రకాల పంటలు రైతులు సాగు చేశారు.


చిలకలూరులో సాగు చేసిన మినుము పంట

30వేల ఎకరాల్లో పండ్ల తోటలు

సాగునీటి సమస్య పండ్లతోటలపై కూడా పడింది. మామిడి, అరటి, బొప్పాయి, ఆకు, జామ, సపోటా కూరగాయల తోటలను సుమారు 30వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ తోటలకు కూడా వ్యవసాయ బోరుబావుల నుంచి సాగునీరు అందాల్సి ఉంది. కానీ భూగర్భజలం ఒక్కసారిగా 250 నుంచి 300 అడుగుల్లోకి పడిపోయింది.



బోరు బావులు అడుగంటాయి

వ్యవసాయ బోరుబావి కింద వరిపంట, మినుము సాగు చేశా. వ్యవసాయ బోరు బావుల్లో భూగర్భజలం అడుగంటింది. ఇక రెండు నెలలు పంటలకు సాగునీరు అందాలి.

జమాల్‌సాహెబ్, రైతు, కొండమాయపల్లె



వర్షాలు లేక జలం తగ్గింది

వర్షాలు లేకపోవడంతో బోరు బావుల్లో జలం తగ్గింది. సాగు చేసిన పంటలు ఎలా రక్షించుకోవాలో మరి. ఇప్పుడే భూగర్భజలం తగ్గితే మార్చి, ఏప్రిల్‌లో ఎలా చేయాలి?

-వెంకటపతి, రైతు, కోటకొండ



ఫిబ్రవరి మాసంలోనే ఇలాగైతే ఎలా?

ఫిబ్రవరి మాసంలోనే వ్యవసాయ బోరుబావుల్లో నీరు తగ్గిపోయింది. వ్యవసాయ బోరు బావి కింద దోస, బంతిపూలు, వంకాయ తోట సాగు చేశా. అరకొర నీటినే పారిస్తున్నా. ఇకపై దేవుడే కాపాడాలి.

-రామక్రిష్ణ, రైతు, నక్కలదిన్నె



బోరుమంటున్న బావులు

బోరుబావులు భూగర్భజలం తగ్గి బావురుమంటున్నాయి. పంటలకు సాగునీరందించడానికి కాల్వల్లో కూడా నీరు లేదు. వాగులు ఇంకిపోయాయి. పంటలను ఎలా కాపాడుకోవాలో.

-రామిరెడ్డి, రైతు, మందలూరు



అరకొర నీటితో..

వ్యవసాయ బోరుబావుల కింద వరి పంట సాగు చేశా. అరకొర నీటితో కష్టాలు ఎదుర్కోవాలి. బోరుబావిలో భూగర్భజలం తగ్గిపోయింది. సాగునీటికి నానా ఇబ్బందులు పడాల్సిందే.

-శ్రీనివాసులు, రైతు, చిన్నకంబలూరు

శాంతి భద్రతలకు విఘాతం

కలగకుండా చర్యలు

- డీఐజీ సీహెచ్ విజయ్‌రావు
- బాధ్యతల స్వీకరణ



కర్నూలు, ఫిబ్రవరి 5: రాబోయే ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయ్‌రావు తెలిపారు. స్థానిక డీఐజీ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ టీమ్ వర్క్‌గా పని చేస్తామన్నారు. ఇతర శాఖల అధికారులతో కలిసి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డీఐజీని కర్నూలు ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, కడప ఎస్పీ సిద్ధార్థ కౌశల్, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

● డీఐజీ గురించి: 2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయనది సొంత జిల్లా పశ్చిమగోదావరి. 2010లో అప్పా హైదరాబాదులో పని చేశారు. 2012లో వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా, 2013లో అనంతపురం అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్‌లో, 2014లో రంపచోడవరం ఏఎస్పీగా, 2015లో సీఐడీ ఏఎస్పీగా, 2016లో ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేశారు. 2017 గుంటూరు అర్బన్ ఎస్పీగా, 2019లో విజయవాడ డిప్యూటీ కమిషనర్‌గా, 2020లో విజయవాడ రైల్వేలో రైల్వే ఎస్పీగా, 2021లో నెల్లూరు ఎస్పీగా, 2023లో మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేశారు. ఇటీవలే డీఐజీగా పదోన్నతి పొంది కర్నూలు వచ్చారు.

● హంగామా చేసిన పోలీసు అధికారులు

బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పోలీసు అధికారులు కాస్త హంగామా చేశారు. కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లు చర్చనీయాంశమయ్యాయి. వేద పండితులు పూర్ణకుంభాలతో స్వాగతం పలకడం.. మేళతాళాల మధ్య స్వాగతాలు తెలపడం.. ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో ఆశీర్వచనాలు, పూజలు చేయించడం చర్చగా మారింది.




డీఐజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న కర్నూలు, నంద్యాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి

ఇదేం దారుణం

శ్మశానానికి కంచె వేసిన వైసీపీ నాయకుడు


నరసాపురంలోని దళితుల శ్మశాన స్థలం

రుద్రవరం, ఫిబ్రవరి 5 : వైసీపీ నాయకులు చివరికి శ్మశానాన్ని కూడా వదిలిపెట్టలేదు. ఆ ఊరు పుట్టినప్పటి నుంచి తాము శ్మశానంగా వాడుకుంటున్న స్థలాన్ని ఆక్రమించుకున్నారని దళితులు మండిపడుతున్నారు. రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలో రెండు దళిత సామాజిక వర్గాలకు చెందిన శ్మశాన స్థలాన్ని వైసీపీ నాయకుడు దున్ని కంచె వేశాడు. కంచె తొలగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. దీంతో దళితులు సోమవారం అక్కడికి వెళ్లి కంచె స్తంభాలు పీకేశారు. తరతరాలుగా ఈ స్థలాన్ని తాము శ్మశానంగా వాడుకుంటున్నామని అన్నారు. అయితే సదరు వైసీపీ నాయకుడు రుద్రవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రుద్రవరం ఎస్‌ఐ పిలుపు మేరకు రెండు దళిత వర్గాలకు చెందిన 200 మంది రెండు ట్రాక్టర్లలో పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. దళిత నాయకులు పోలీసులకు పరిస్థితిని వివరించారు. అనంతరం రుద్రవరం తహసీల్దారు మురళీమోహన్‌కు ఆ శ్మశాన స్థలం తమకు కేటాయించాలని వినతిపత్రం అందించారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

- గంటల తరబడి మొరాయిస్తున్న సర్వర్లు
- తాగునీరు, మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
- రిజిస్ట్రేషన్ల కోసం వచ్చి నరకం చూస్తున్న వృద్ధులు



కల్లూరు, ఫిబ్రవరి 5: కర్నూలు జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక కారణాలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. సోమవారం గంటల తరబడి సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ స్తంభించిపోయి క్రయ, విక్రయదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. గంటల తరబడి అప్లికేషన్లు ఓపెన్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదని అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు, మహిళలు కూర్చోవడానికి కుర్చీలు లేక, తాగడానికి నీరు లేక కనీసం మరుగుదొడ్ల సదుపాయం కనిపించకపోవడంతో మహిళలు నరకం చూశారు. సర్వర్లు మొరాయించడంతో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగక జనం వెనుదిరిగారు. మరో పక్క కార్డు ప్రైమ్ 2.0 విధానం అమల్లోకి వచ్చిన తర్వాత తరచూ రిజిస్ట్రేషన్లు జరగక వినియోగదారులు అవస్థలు పడ్డారు. రిజిస్ట్రేషన్ల కోసం వృద్ధులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదు. కాని ఇంటి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు పెద్దఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో నగదు ఇచ్చుకోలేని కొందరు వృద్ధులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తీసుకురావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం ఒక వృద్ధురాలిని మెట్లపై తీసుకెళ్లేందుకు నలుగురు వ్యక్తులు కష్టపడ్డారు. తీరా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. వినియోగదారుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ కోసం వృద్ధురాలిని మోసుకుపోతున్న దృశ్యం


రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో నిరీక్షిస్తున్న జనాలు

ఓపీ కిటకిట



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు, ఓపీ కోసం క్యూలో ఉన్న మహిళలు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 5: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ రోగులు కిటకిటలాడారు. సోమవారం ఓపీలకు 2696 మంది రోగులు పోటెత్తారు. ఇందులో 298 మంది అడ్మిషన్లు పొందారు. ఆసుపత్రి అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఓపీ టికెట్ల కోసం ఉదయం నుంచే రోగులు బారులు తీరారు. ఉదయం 9 గంటలకు ఓపీ కోసం క్యూలైన్లలో నిలబడి 11 గంటలైనా ఓపీ టికెట్లు ఇవ్వడం లేదని కొందరు రోగులు మండిపడుతున్నారు.


భుజాలపై చేయి వేసుకొని రోగిని తీసుకెళ్తున్న సహాయకులు, రోగులతో కిక్కిరిసిన ఓపీ క్యూలైన్



బిల్లులు రావని భయం

- మధ్యలో నిలిచిపోయిన ప్లాట్‌ఫారం పనులు
- రేకులు బిగించేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు


నిలిచిపోయిన ప్లాట్‌ఫారం పనులు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 5: పనులు చేస్తే బిల్లులు రావని కాంట్రాక్టర్లు భయపెడుతున్నారు. దీంతో టెండర్లలో పాల్గొనడానికి ముందుకు రావడం లేదు. కర్నూలులో రైతుల సౌకర్యార్థం రూ.6 కోట్లు ఖర్చు పెట్టి ఆధునిక ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని చేపట్టేందుకు గత సంవత్సరం మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు టెండర్లు పిలిచారు. 8 శాతం లెస్సుతో హైదరాబాదుకు చెందిన ఒక కాంట్రాక్టరు ఈ పనిని దక్కించుకున్నాడు. అయితే ఈ ఆళ్లగడ్డకు చెందిన ఓ సబ్ కాంట్రాక్టరు మెయిన్ కాంట్రాక్టర్ కొంత డబ్బు ముట్టజెప్పి పనులు చేస్తున్నాడు. ఇప్పటికి దాదాపు రూ.2 కోట్ల దాకా ఖర్చు చేశాడు. మొదటి బిల్లు కింద రూ.1.30 కోట్లు అధికారులు కాంట్రాక్టరుకు చెల్లించారు. సెప్టెంబరులో రూ.30 లక్షలు, వారం క్రితం మరో రూ.60 లక్షలు చెల్లించేందుకు అధికారులు మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులకు ఫైలు పంపారు. అయితే.. సీఎంఎఫ్ నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్లాట్‌ఫారం నిర్మాణానికి సంబంధించి సివిల్ వర్క్ దాదాపు పూర్తయిందని అధికారులు తెలిపారు. ఆ తర్వాత చివరి దశలో రేకులు ఏర్పాటు చేసే పని కోసం గత రెండు నెలల నుంచి గుంటూరులోని మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటికి నాలుగు సార్లు కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తూ టెండర్లను పిలిచారు.

● ఆ పనులు చేయలేం:

రేకులు బిగించే పని కోసం నాలుగు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ అటువైపు చూడకపోవడంతో చివరి దశ పని ఎప్పుడు చేపడతారో, ఎప్పుడు పూర్తవుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ప్రస్తుత రబీకి రైతులకు అందుబాటులోకి రావాల్సిన ప్లాట్‌ఫారం కనీసం వచ్చే ఖరీఫ్ జూన్ నాటికైనా పూర్తి చేసి తమకు అందుబాటులోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు. అయితే.. ప్రస్తుతం సివిల్ వర్క్ పనులు చేసిన కాంట్రాక్టరుకు చేసిన పనికి సంబంధించి సక్రమంగా బిల్లులు అందకపోవడంతో ఆ కాంట్రాక్టరు గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నాడు. ఈ పరిస్థితిని గుర్తించిన కొంత మంది కాంట్రాక్టర్లు కొత్తగా చేపట్టాల్సిన రేకుల బిగింపు పనులను తాము దక్కించుకున్నా పని పూర్తయిన తర్వాత బిల్లులు సకాలంలో అందిస్తారో లేదోనని టెండరు ప్రక్రియలో పాల్గొనడం లేదు. ఈ విషయంపై సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు మాట్లాడుతూ త్వరలోనే ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, నిధుల సమస్య లేదని, కాంట్రాక్టరును ఒప్పించి పని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- సీజ్ చేసిన 110 బంగారు అంగళ్లను తెరిపించాలి
- కార్పొరేషన్ కార్యాలయం దాకా ర్యాలీ, ధర్నా


షరాఫ్‌బజార్ నుంచి కార్పొరేషన్‌కు ర్యాలీగా వస్తున్న దుకాణ యజమానులు, వ్యాపారులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 5: నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వీడి షరాఫ్ బజార్‌లో సీజ్ చేసిన అంగళ్లను తెరిపించాలని షరాఫ్‌బాజర్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కామిశెట్టి గురువయ్య డిమాండ్ చేశారు. సోమవారం అంగళ్లను తెరిపించాలని కోరుతూ షరాఫ్‌బాజర్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ, షరాఫ్‌బజార్ జ్యువెలరీ అసోసియేషన్ అధ్వర్యంలో కార్పొరేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ గత కమిషనర్ బాలాజీ ఉన్న సమయంలో షరాఫ్‌బజార్‌లో పార్కింగ్ స్థలం లేదని 110 అంగళ్లను సీజ్ చేశారని అన్నారు. ఇది జరిగి 30 నెలలు గడుస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అంగళ్లకు పార్కింగ్ స్థలం లేదనే ఒకే ఒక్క కారణంతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ సీజ్ చేయడం అన్యాయమన్నారు. అనంతరం స్పందనలో కమిషనర్ ఎ.భార్గవతేజకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు బెళగంటి రమణ, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి వై.రమేష్, సొసైటీ కోశాధికారి జూటూరు రాము, ఉపాధ్యక్షుడు బచ్చు శేషయ్య, జయంతి శ్రీరాములు పాల్గొన్నారు.

బుద్ధి ఉన్నవాళ్లెవరూ జగన్‌కు ఓటెయ్యరు

- వైసీపీ సర్పంచుల ఆగ్రహం


మండల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న వైసీపీ సర్పంచ్

హొలహర్వి, ఫిబ్రవరి 5: సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి ఉన్నవారెవ్వరూ ఓటెయ్యరని వైసీపీ సర్పంచులు ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో వైసీపీ ప్రభుత్వం తీరుపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా అర్ధగేరి సర్పంచ్ గురునాథ్ రెడ్డి, బాపురం సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ తీరు వల్ల గ్రామాల్లో సర్పంచులు చులకనైపోయామని అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేస్తామని నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే, నిధులన్నీ ప్రభుత్వమే వాడుకోవడంతో పైసా పనులు చేయలేకపోతున్నామని ఆవేదన చెందారు. సొంత పార్టీపై విమర్శలు వస్తున్నా, అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ లింగప్ప, ఎంపీటీసీ పెట్టి కంతమ్మ మౌనం వహించారు.

మట్టి తవ్వకాలపై విజిలెన్స్ ఆరా

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: అవుటర్ రింగ్ రోడ్డు కోసం మట్టి తవ్వకాలపై గనుల శాఖ విజిలెన్స్ విభాగం పరిశీలించిందని డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం నగర శివారులో తవ్వకాలకు సంబంధించి ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో తవ్వకాలు జరిపారనే దానిపై సర్వేలు నిర్వహించారు. దీనికి సంబంధించి రాయల్టీలు చెల్లించాలని కోరారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నారు.

పెద్దపులి సంచారం

రుద్రవరం, ఫిబ్రవరి 5 : రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజనులోని చెలిమ రేంజ్ పరిధిలో డి.కొట్టాలపై భాగంలోని పంట పొలాల్లో పెద్దపులి సంచరించినట్లు స్థానికులు సోమవారం తెలిపారు. పంట పొలాల వైపు వరుసగా నాలుగు రోజులు పెద్దపులి సంచరించింద న్నారు. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నా రు. పంట పొలాలకు కాపలా వెళ్లాలంటే జంకుతున్నారు.

కౌరవ సేనాని జగన్‌కు ఓటమి తప్పదు

- టీడీపీ కార్యాలయంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: కౌరసేనాని జగన్మోహన్‌రెడ్డికి పరాభవం తప్పదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తానని, తాను అర్జునుడినని, టీడీపీ, జనసేన పార్టీలను కౌరవసేనగా ఆయన పొరబడుతున్నారని అన్నారు. నిజానికి జగన్‌రెడ్డిదే కౌరవ సేన అని, వారికి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు. ఇప్పటికే జగన్ పాలనలో ఏ సామాజిక వర్గం సుఖంగా లేదని, దుష్టచతుష్టం గెలిచినట్లు చరిత్రలో ఎక్కడా లేదని, ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కౌరవసేనలో జగన్మోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి దుష్టచతుష్టయం అని, వారు వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ఎవరి వారు దొరికినంత దోచుకుని రాష్ట్రాన్ని దివాలా తీయించారని అన్నారు. కార్యక్రమంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరాయచౌదరి, ప్రొఫెషనల్ వింగ్ విభాగం కన్వీనరు పి. భరత్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు

ఎమ్మెల్సీ బీటీ నాయుడు


అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 5: శాసన సభ, శాసన మండలి బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్‌తో సీఎం జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు చెప్పించారని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం అమరావతి నుంచి ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. 127 అంశాలు, 34 పేజీలు సుదీర్ఘంగా అబద్ధ ప్రసంగాన్ని చేయించారన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగా లకు సంబంధించిన అంశాలను ఆయన వివరిస్తూ గవర్నర్‌తో ఉభయ సభను ఉద్దేశించి అబద్ధాలు వెల్లడిస్తుంటే ముఖ్యమంత్రి బల్లలు చరుస్తుంటే సభ్యులు కూడా అదే పని చేశారని అన్నారు. 5 సంవత్సరాలు పూర్తయినా ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని, డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని, మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని ధ్వజమెత్తారు.

బకాయిలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏపీ జేఏసీ చైర్మన్ వెంగల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి 2 లక్షల నుంచి 4 లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉద్యోగుల సంఘాలతో పీఆర్సీ కమిటీ చర్చలు జరపాలని అన్నారు. పీఆర్సీ అమలు చేసే లోపు 30 శాతం ఐఆర్‌తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 11వ తేదీ జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడలో సర్వసభ్య సమావేశం, 12వ తేదీ నోటీసులు, 13వ తేదీ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాశన్న, రామకృష్ణ, జనార్ధన్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

15న వక్తృత్వ పోటీలు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 5: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న క్లస్టర్ యూనివర్శిటీ తెలుగు అధ్యయన శాఖ, కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) సంయుక్త ఆధ్వర్యంలో నగర స్థాయిలో డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల్లో ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. డాక్టర్ జయలక్ష్మి నాయుడు, దీపక్ తేజ హాస్పిటల్ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని వారు తెలిపారు. డిగ్రీ స్థాయిలో 'మహనీయుల జీవితం - మనకు అనుసరణీయం' అనే అంశం, ఇంటర్ స్థాయిలో 'వాడుకలో, బోధనలో, పాలనలో, మన తెలుగు' అనే అంశంపై ప్రసంగించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు 5 నిముషాల వ్యవధిలో ప్రసంగించాలని సూచించారు. వివరాలకు సెల్ నెం. 94408 34017, 99667 53887లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రజా చైతన్యంతోనే సమస్యలు పరిష్కారం

- సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి


దీక్షలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 5: సీమ ప్రజల చైతన్యం ద్వారానే రాయలసీమలోని సమస్యలు పరిష్కారం అవుతాయని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఎదురుగా రాయలసీమ నిజ దర్శన దీక్ష నిర్వహించారు. రాయలసీమ పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత డిమాండ్లను పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చాలని కోరుతూ రాయలసీమ విద్యావంతుల వేదిక, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ దీక్షకు ముఖ్య అతిథిగా దశరథ రామిరెడ్డి విచ్చేసి ప్రసంగించారు. ఈ దీక్షకు వేదిక నాయకుడు రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, ముందుగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి దీక్ష శిబిరం ప్రారంభించారు. రైతు సంఘం నాయకుడు ఆది నారాయణరెడ్డి ధర్నాను ప్రారంభించారు. బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ అన్యాయానికి, మోసానికి, ప్రభుత్వ పెద్దల కుట్రలకు బలై పోతూ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ భూముల్లో 25శాతం భూములకు మాత్రమే నీటి వసతి కల్పించారని, కేటాయించిన నికర జలాలు కూడా రాయలసీమకు రావడం లేదని ఆరోపించారు. రాయలసీమకు నష్టం కలిగించే 69 ఉత్తర్వులను రద్దు చేయాలని, ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని, కర్నూలులో మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ ఇంత కాలం అధికారంలో ఉన్న పార్టీలు, రేపు ఎన్నికల్లో గెలిచి అధికారం పొందాలని అనుకుంటున్న పార్టీలు అన్నీ రాయలసీమకు ద్రోహం చేశాయని అన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ప్రజల వద్దకు ఓట్ల కోసం వచ్చే నాయకులను సీమ సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కందనోలు కృష్ణయ్య, సీమ విద్యార్థి సంఘం నాయకులు రవికుమార్, సీమకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, జేవీవీ బాధ్యుడు శివ శంకర్‌గౌడ్, సీపీఐ నాయకుడు రామకృష్ణారెడ్డి, లోక్‌సత్తా నాయకుడు డేవిడ్, న్యాయవాది హేమలతా రెడ్డి, ఎస్‌డీపీఐ నాయకులు చాంద్ బాషా, హంద్రీ పరిరక్షణ సమితి నాయకుడు రామాంజినేయులు, జనసేన పార్టీ నాయకుడు పవన్‌కుమార్, విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కరరెడ్డి, డీటీఎఫ్ నాయకుడు రత్నం ఏసేపు పాల్గొన్నారు.

తప్పులను సవరించని అధికారులు

- ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లు
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు



ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5: ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితాలో ఉన్న తప్పులు సవరణకు నోచుకోలేదు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో గతంలో ఓట్లు ఎలా ఉన్నాయో ప్రస్తుతం అలాగే ఉన్నాయి. సాధారణంగా మృతి చెందిన వాళ్ల ఓట్లు, డబుల్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్లను బీఎల్ఓలు తొలగించాలి. అయితే పట్టణంలోని 19వ వార్డు, 32వ వార్డుల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో గతంలో ఎలా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉండటం గమనార్హం. 19వ వార్డులోని పోలింగ్ కేంద్రం 105లో ఇంటి నెం. 1-842-9 ఇంట్లో వడ్డె గిడ్డమ్మ, 1-856 ఇంటి నంబర్‌లో ఈరమ్మ వడ్డె, 1-843-55 ఇంట్లో కే ధనుంజయ, 1-805-68లో గొల్ల లక్ష్మమ్మ, 1-843లో లక్ష్మమ్మ, 1-1097లో జే నాగేశ్వరరావు మృతి చెందారు. ఓటరు జాబితాలో వీరి ఓటను తొలగించాల్సి ఉండగా కొత్త జాబితాలో అలాగే ఓట్లు వచ్చాయి. అలాగే 32 వార్డుకు చెందిన మంగలి ప్రతాప్‌పేరుపై పోలింగ్ కేంద్రం 116లోని ఓటరు జాబితాలో వరుస సంఖ్య 665తోపాటు 667లోను రెండు ఓట్లు ఉన్నాయి. అలాగే ఆదే వార్డు, అదే పోలింగ్ కేంద్రంలో వరుస సంఖ్య 1150, 1151లో ముల్లా సుభుర్ బాషా పేరుపై రెండు ఓట్లు ఉన్నాయి. మృతి చెందిన, డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్న వాటిని తొలగించాలని ఓటరు జాబితా సవరణకు ముందు స్థానికంగా ఉన్న టీడీపీ వార్డు ఇన్‌చార్జి శిల్పి భాస్కర్ బీఎల్ఓకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

స్వామి వారికి మూడు కిలోల వెండి


దాతలకు స్వామివారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

కౌతాళం, ఫిబ్రవరి 5: ఉరుకుంద ఈరన్న స్వామి వారికి సోమవారం రోజున ఓ భక్తుడు మూడు కిలోల వెండిని విరాళంగా ఇచ్చారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారికి ఆదోని వాస్తవ్యుడైన క్రిష్ణ 3.240 కిలోల వెండి బిస్కెట్లను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతకు ఆలయ అధికారులు స్వామి వారి శేషవస్త్రాలు అందజేశారు.

మహానందీశ్వరుని సన్నిధిలో జొన్నవిత్తుల

మహానంది, ఫిబ్రబవరి 5: మహానంది క్షేత్రంలో సోమవారం ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మండపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం వీరిని వేద పండి తులు ఆశీర్వదించారు. ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జొన్నవిత్తుల మాట్లాడుతూ తాను మహానందీశ్వరుని పాటలను రచించాలని సంకల్పించినట్లు తెలిపారు.


సినీ గేయ రచయిత జొన్నవిత్తులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

వారి సేవలు మర్చిపోలేం

- డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర రెడ్డి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 5: కరోనా కాలంలో నర్సులు ఎంతో కష్టపడ్డారని, తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి సేవలు అందించి కరోనా వారియర్స్‌గా నిలిచారని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. సోమవారం సూపరింటెండెంట్ చాంబరులో ఏపీ నర్సింగ్ స్టూడెంట్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కట్టడి చేసేందుకు డాక్టర్లతో పాటు నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సింగ్ గ్రేడ్-1 సూపరింటెండెంట్ రామతులసమ్మ మాట్లాడుతూ నర్సులు రోగులకు చికిత్స అందించడంతో పాటు వైద్యులు, ఇతర వైద్యనిపుణులకు సహాయం చేసి వైద్య రికార్డులను నిర్వహిస్తారణి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు నాగమణి, రాజ్యలక్ష్మి, అనుసూయ, ఏపీ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తకోట మోహన్, నాయకులు సురేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రారంభమైన అర్చక శిక్షణ తరగతులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో గురు రాజాంగణ భవనంలో రెండు రోజుల అర్చకుల ట్రైనింగ్ అకాడమీలో శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభించారు. అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డా.ఎన్. తనూజ్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు మాట్లాడుతూ అర్చకులు హుందాతనాన్ని, నిష్ఠను పాటించినప్పుడే ఆ గౌరవం దక్కుతుందన్నారు. సమావేశంలో మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, అర్చక వెల్ఫేర్ ట్రస్టు బోర్డు మెంబర్ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి

తుగ్గలి, ఫిబ్రవరి 5: ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో.. యువకుడు రంజిత్ నాయక్ (20) మృతి చెందాడు. సోమవారం జి.ఎర్రగుడి, చెరువుతాండా గ్రామాల మధ్యలో అనంతపురం జిల్లా పైనాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి నాయక్, లక్ష్మీబాయిల కుమారుడు రంజిత్ నాయక్ గ్రామం నుంచి ఒక్కడే ఆటో తీసుకుని వెళ్తుండగా.. అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అటువైపు వెళ్తున్న ప్రయాణీకులు క్షతగాత్రున్ని గుత్తి వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

CHANGE OF NAME

I, CHITTAMREDDY JAYASUDHA (OLD NAME) R/O.H.NO:76/117-1-2, Krishnareddy Nagar, Kurnool Dist, AP., I have to changes my Name CHITTAM JAYADUDHA (New Name). W/O CHITTAM RAMA KRISHNA REDDY AJL-180145

WANTED

కర్నూలులోని ఓ ప్రముఖ బాయ్స్ హాస్టల్ నందు పనిచేయుటకు వంట మనిషి కావలెను. (స్త్రీలుగాని, పురుషులుగాని). సంప్రదించండి. సెల్ : 98488 78154 AJL-180094

BUSINESS OFFER

★ Sri Avani Eco-life Pvt. Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బయో డిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారిగా డీలర్లు కావలెను. Ph: 9493786468 / 6301041696. AJH-13362

CHANGE OF NAME

I, CHUGUR SUNAR AYUB S/O CHUGUR SUNAR ABDUL RASOOL (Old Name), R/O 25/425 HAVANNAPET ADONI-518301 KURNOOL Dist., A.P., I have changed my name in my passport as CHUGUR SUNAR MAHAMMED AYUB (NEW Name). AJL-180145

FOR ADVERTISEMENTS CONTACT.
Cell: 99854 11369

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర 7382114647 AJA-176954

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
క్లాసిఫైడ్స్ CLASSIFIEDS

Extra 5% GST

4 లైన్ల క్లాసిఫైడ్ కేవలం రూ. 240/- లు
ప్రతి అదనపు లైను రూ. 45/- మాత్రమే

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన పూర్తిగా ఉచితం

- ఉద్యోగ అవకాశాలు
- రియల్ ఎస్టేట్
- ఎడ్యుకేషన్
- హెల్త్‌కేర్ & బ్యూటీకేర్
- మ్యాట్రిమోని
- అమ్మకము & కొనుగోలు
- టూర్స్ & ట్రావెల్స్

ఆంధ్రజ్యోతి కార్యాలయం: నియర్ ఇండస్ స్కూల్, పందిపాడు గ్రామం, కర్నూలు.

కర్నూలు : 99854 11141, 99854 02424, 99854 02544, 97036 18696, 99854 02890, 99591 77333,
ఆదోని : 97036 18726,
ఎమ్మిగనూరు : 78931 48646,
నంద్యాల : 99854 02121
డోన్: 94911 02749
నందికొట్కూరు : 83092 18935

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

టీడీపీలో చేరిక



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన యువకులు

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 5: నందికొట్కూరు పట్టణానికి చెందిన యువకులు సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో అల్లూరు గ్రామంలోని ఆయన నివాసంలో చేరారు. టీడీపీ పట్టణ నాయకులు రసూల్, జమీల్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సంతోష్, ఈశ్వర్, నవదీప్, ఆరిఫ్, ఆదిల్, అవినాష్, మహబూబ్ బాషా, షాకీర్, కలాం, నేత్ర, కార్తూ తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ముర్తుజావలి, జాకీర్ హుశేన్, షాలు, నిషార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ



ఎర్రగూడూరులో నాయకులను కలిసిన చిన్నవెంకటస్వామి

పాములపాడు, ఫిబ్రవరి 5: అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న టీడీపీ నాయకులను టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్నవెంకటస్వామి సోమవారం పరామర్శించారు. మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో సర్పంచ్ మంగమ్మబాయి భర్త హనుమంత్ నాయక్, వేంపెంట గ్రామంలోని గాండ్ల కృష్ణుడుని పరామర్శించారు. ఆయన వెంట తెలుగు యువత మండల అధ్యక్షుడు మధుకృష్ణ, లింగేశ్ గౌడ్, మైనార్టీ నాయకులు, ముజుబూరు, బీసీ సంఘం నాయకులు వేణుగోపాల్, ఉస్మాన్ లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'మిస్టర్ ఆంధ్ర' బాడీ బిల్డింగ్ చాంపియన్‌గా నంద్యాల వాసి



ట్రోఫీని అందుకుంటున్న ముకుంద

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 5: మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌గా నంద్యాలకు చెందిన ముకుంద నిలిచాడు. రాజమండ్రిలో ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ జరిగింది. ఈ పోటీల్లో బి.ముకుంద 75కిలోల విభాగంలో మొదటి స్థానం సాధించి ఓవరాల్ విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. బాడీ బిల్డర్ ముకుంద నంద్యాలలో ఖాజా మొహిద్దీన్ వద్ద శిక్షణ పొంది ఈ ఘనత సాధించాడు. చాంపియన్‌గా నిలిచిన ముకుందను కోచ్ ఖాజామొహిద్దీన్, పట్టణ ప్రముఖులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: కమిషనర్



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ పి. నిరంజన్‌రెడ్డి

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 5: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి వీలైనంత త్వరగా పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మున్సిపల్ కమిషనర్ పి. నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలో పలు వీధుల్లో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సంబంధిత వార్డు ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామని అన్నారు. అలాగే సాయంత్రం రెవెన్యూ క్వార్టర్స్, విద్యానగర్ వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ మాబున్నీసా పరిశీలించారు. స్థానికంగా మంచినీటి సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

రుద్రకోటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న శివస్వాములు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: నల్లమల అటవీ ప్రాంతంలోని రుద్రాణీసమేత రుద్రకోటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివదీక్షను స్వీకరించిన శివస్వాములు వివిధ రుద్రకోటేశ్వరాలయానికి తరలివచ్చారు. ముందుగా క్షేత్ర పరిధిలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి గర్భాలయంలో రుద్రకోటేశ్వర శివలింగానికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా క్రతువులను నిర్వహించారు. అలాగే క్షేత్ర పరిధిలోని కల్పవృక్షానికి, నాగుల కట్టకు, సీతారాముల వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు రుద్రకోటేశ్వర దేవస్థానం అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఫోర్‌వీలర్ వాహనాల్లో భక్తుల నుంచి అటవీ శాఖ వారు ఒక్కో వాహనానికి రూ.300చొప్పున వెహికల్ పాస్ చార్జీని వసూళ్లు చేశారు.

'రైతులకు అందుబాటులో ఉంటాం'

నందికొట్కూరు ఫిబ్రవరి 5: రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని పగిడ్యాల మండల ప్రాథమిక పరపతి సంఘం ఛైర్మన్ గణపురం పర్వతరెడ్డి గారి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం శ్రీనివాసరెడ్డి ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. పగిడ్యాల సర్పంచ్ శేషన్న, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి: కలెక్టర్



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 5: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థలలో చదువుతున్న 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండ జోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం వైఎస్సార్ సెంటినరీ హాలులో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల నియంత్రణ పోస్టరును ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా విద్యార్థులు రక్తహీనత నివారణకు ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, సంక్షేమ వసతి గృహాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకో ాలని ఆదేశించారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో డీఎంహెచ్‌వో, జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

'ఒక శాతం సెస్ జమ చేయాలి'

పబ్లిక్ వర్క్స్, మున్సిపాలిటీ లోకల్ బాడీస్, ప్లాన్ అప్రూవల్ అథారిటీస్, ఎంపీడీవో, ప్రభుత్వ రంగ సంస్థలు విధిగా ఒక శాతం లేబర్ సెస్‌ను డిడక్టు చేసి ఏపీ భవన నిర్మాణరంగ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన కార్మికుల సంక్షేమ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంయుక్త కమిషనర్ బాలునాయక్, కార్మిక ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్మిక కమిషనర్ బషిరున్నీసా బేగం, తదితర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా ఒక శాతం సెస్ కు సంబంధించిన వివరాలను కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు పంపాలని ఆదేశించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఒక శాతం సెస్ మొత్తాన్ని జమ చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని కార్మిక సహాయ కమిషనర్, కమిటి సభ్యులను కలెక్టర్ సూచించారు.

● నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో సోమవారం పశుసంవర్ధక శాఖ డైరీని నంద్యాల కలెక్టర్ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొని ఆవిష్కరించారు.

'వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి'



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 5: అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. పగిడ్యాలలోని ఎస్సీ కాలనీలో సోమవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. జయసూర్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేయాల్సింది పోయి.. వారి నుంచి భారీగా ఆస్తులు కూడగట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. మద్యం, ఇసుక, మట్టి మాఫియా ఇలా ప్రతి పనిలో పర్సెంటేజ్ తీసుకుంటూ సీఎం పోస్టును వ్యాపారంగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, క్లస్టర్ వాసురెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి దామోదర్ రెడ్డి, వగిలి శ్రీనివాసులు, పగడం శేఖర్, పాండు, షాతన్‌బాబు, శ్రీను, వెంకటేశ్వర్లు, గుండెపోగు బాబు, బీరవోలు సుగురు శివన్న, హనుమన్న, నాగేంద్ర, లింగన్న, గిడ్డయ్య, శ్రీను, ఎల్లస్వామి, సంకిరేణిపల్లి మచ్చ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 5: మండలంలోని బి.కోడూరు గ్రామానికి చెందిన చిన్న మాబు అనే వ్యక్తి గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధం అయింది. పశువుల మేత కోసం తన స్థలంలో వేసిన గడిడవాముకు నిప్పంటుకుని కాలి బూడిదైపోయింది. బాధితుడికి రూ.50వేల మేర నష్టం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. టీడీపీ గ్రామ నాయకుడు, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిటిబొట్ల భరద్వాజ శర్మ బాధిత కుటుంబానికి రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక నాయకులు వడ్డె బాలుడు, ప్రతాప్, అంకిరెడ్డి ఉన్నారు.

వేదిక్ గణితంలో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 5: జిల్లా స్థాయి వేదిక్ గణితం పోటీల్లో నంద్యాలలోని శాంతినికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి మొదటి, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ సుధాకర్ తెలిపారు. సోమవారం నంద్యాలలోని పాఠశాలలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో ఈ నెల 4న జరిగిన జిల్లా స్థాయి వేదిక్ గణిత పోటీల్లో ఈశ్వర్, ఆదిత్యలు పతకాలు సాధించారన్నారు. వేద గణితంతో విద్యార్థుల్లో జ్ఞాపికశక్తి, ఏకాగ్రత, సృజనాత్మకత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు తక్కువ వ్యవధిలో ఎన్నో సమస్యలను వేగవంతంగా పరిష్కరించగల శక్తిసామర్థ్యాలు వేద గణితంతో సాధ్యమవుతుందన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను సుధాకర్, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 5: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాయుడు, మున్సిపల్ ఛైర్మన్ మారుఫ్ ఆసియాలు పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని సీహెచ్‌సీలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి చెంచు గర్భిణిలకు స్కానింగ్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణిలు, బాలింతలకు, మహిళలకు పౌష్టికాహార సమతుల్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాయుడు మాట్లాడుతూ.. చెంచు గర్భిణిల కోసం ఆయా గూడేల్లో నిర్వహించే ప్రతి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణిలు వైద్యులను సంప్రదించి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అలాగే చెంచు మహిళలు రక్త హీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. జననీ సురక్షయోజన పథకం, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు లక్ష్మి ప్రసన్న, ప్రతాప్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, ఏఎన్ఎం సరోజమ్మ పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచక పాలన'



'జయహో బీసీ' సదస్సులో పాల్గొన్న నాయకులు

శ్రీశైలం, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన కొనసాగుతోందని, దీంతో అన్నివర్గాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని సున్నిపెంట గ్రామంలో సోమవారం 'జయహో బీసీ' సభ నిర్వహించారు. ప్రజలు ప్రతి అంశాన్ని గమనిస్తున్నారన్నారని, వైసీపీకి గుణపాఠం చెబుతారని అన్నారు. బీసీ నాయకులు వడ్డే తిరుపాల్ బాబు, శివప్రసాద్, మండల నాయకులు శ్రీనివాసరెడ్డి, బెంజిమెన్, జీవులా నాయక్, సుబబ్బారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 5: శ్రీశైలం దేవస్థానం భక్తులకు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ పథకానికి ఆదోనికి చెందిన జి.రాజేష్ రెడ్డి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. లక్ష విరాళాన్ని సహాయ కమిషనర్ వెంకటేష్‌కు అందజేశారు. భక్తులకు దేవస్థానం అధికారులు అన్నదాన విరాళం బాండు, శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

కలెక్టర్ అభినందన

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 5: జాతీయ స్థాయికి ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించిన ఉపాధ్యాయినిని, విద్యార్థినిని సోమవారం కలెక్టరేట్‌లో నంద్యాల కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అభినందించారు. విజయవాడలో జరిగిన దక్షిణ భారత జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్ 2024 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించినట్లు జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు తెలిపారు. డీఈవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుంచి ఉపాధ్యాయ విభాగంలో బనగానపల్లె జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన షెహనాజ్ బేగం ఆటోమేటెడ్ హ్యాండ్ శానిటైజర్, డిస్పెన్సర్, అలాగే కృష్ణమోహన్ నేతృత్వంలో విద్యార్థి విభాగంలో కొత్తపల్లి మండలం దుద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ చెందిన 9వతరగతి విద్యార్థి గంగాధర్ రెడ్డి ప్రదర్శించిన ఆటోమాటిక్ సోలార్ ట్రాకర్ ప్రాజెక్టులు ఉత్తమ ప్రాజెక్టులు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు వీరిరువురిని అభినందించారు. సైన్స్ కోఆర్డినేటర్స్ సుబ్బారెడ్డి, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

'వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి'



కేజీబీవీలో రికార్డులను పరిశీలిస్తున్న జీసీడీవో సువర్చల

కొత్తపల్లి, ఫిబ్రవరి 5: త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీవో సువర్చల సూచించారు. కొత్తపల్లిలోని కేజీబీవీని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్థానికంగా ఉన్న జూనియర్ కళాశాలను సందర్శించి ఇంటర్ విద్యార్థినులతో పంచతంత్రం, ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఎలా ప్రిపేర్ అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రణాళికాతో చదివితే వంద శాతం విజయం సాధించవచ్చని ఆయన తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ కృష్ణాబాయి, ఉపాధ్యాయులు రామలక్ష్మి, నాగలక్ష్మి, రమాదేవి, హనీఫాలతో సమావేశమయ్యారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థినులకు ఏ విధంగా అవగాహన కల్పించాలో వాటిపై జీసీడీవో వివరించారు.

సరితకు ఆర్ట్ చాలెంజ్ అవార్డు



బ్రహ్మానందం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సరిత

పాణ్యం, ఫిబ్రవరి 5: పాణ్యం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారులు దివంగత తిరుమల కూతురు సరిత సినీ హాస్య నటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా ఆర్ట్ చాలెంజ్ అవార్డు అందుకున్నారు. ఈనెల 1వ తేదీన బ్రహ్మానందం పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆర్ట్ చాలెంజ్ అవార్డు చిత్రకళా పోటీలలో తృతీయ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఆదివారం బ్రహ్మానందం చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. మండలంలోని చిత్రకారులు, గ్రామస్థులు సరితను అభినందించారు.

నంద్యాల డీఎస్పీగా రవీంద్రనాథ్‌రెడ్డి



ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిసిన డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 5: నంద్యాల డీఎస్పీగా రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన డీఎస్పీ మహేశ్వరరెడ్డి స్థానంలో ఆయన వచ్చారు. సత్యసాయి జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తూ పదోన్నతిపై నంద్యాల డీఎస్పీగా రవీంద్రనాథ్‌రెడ్డి వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, ఫిబ్రవరి 5: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై అశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం లాస్య నర్తనం అకాడమీ, హైదరాబాద్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

పల్లకిపై మహానందీశ్వరుడి విహారం



మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, ఫిబ్రవరి 5: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ప్రత్యేక పల్లకిపై మహానందీశ్వరుడ్ని ఆలయ వేదపండితులు, అర్చకులు ఊరేగింపు జరిపారు. ముందుగా ఆలయం ప్రాంగణంలోని అలంకార మంటపంలో మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించిన పల్లకిపై అర్చకులు ఆశీనులు గావించారు. అనంతరం వేదమంత్రాలతో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'రూ.10 వేల వేతనం ఇవ్వాలి'



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకురాలు శంషాద్‌బీ, ముబారక్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈవో జానకీరామ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలని, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సమకూర్చాలని, ఏడాది మొత్తం తమకు గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఏదైనా ప్రమాదానికి గురైతే ప్రమాద బీమా సదుపాయం, ఈఎస్ఐ సౌకర్యం ఇవ్వాలని కోరారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, కార్మికుల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మీబాయి, సీతమ్మ తదితరులు ఉన్నారు.

డేటా సైన్స్ స్పెషలైజ్డ్ ల్యాబ్‌లు ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శాంతిరాముడు

పాణ్యం, ఫిబ్రవరి 5: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డేటా సైన్స్ స్పెషలైజ్డ్ ల్యాబ్‌ను ఆర్జీఎం విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అనువైన విద్యాబోధనకు అనుగుణంగా ల్యాబ్‌లు నిర్మించినట్లు తెలిపారు. క్లౌడ్ కంప్యూటరింగ్, మెషిన్ లర్నింగ్, బిగ్‌డేటా, కంప్యూటర్ విజన్, జనరల్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు ఈ ల్యాబ్‌లలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎండీ శివరాం, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ అశోక్ కుమార్, హెచ్‌వోడీ భాస్కరరావు, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ సులేమాన్‌బాషా, డాక్టర్ కిషోర్‌కుమార్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ మధుసూదన్‌చెట్టి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుపై పర్యవేక్షణ



చెలిమిళ్ళ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

పాములపాడు, ఫిబ్రవరి 5: రబీ పంటలకు సంబంధించి పంట నమోదు ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ రైతులను అడిగి తెలుసుకొన్నారు. సోమవారం మండలంలోని చెలిమిళ్ళ గ్రామంలో ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి క్షేత్ర స్థాయిలో రైతుభరోసా సిబ్బంది, ఉద్యానవన వ్యవసాయ సహాయకులు పంట నమోదు కార్యక్రమం పూర్తి చేశారు. అయితే సిబ్బంది నమోదు ప్రక్రియ సక్రమంగా చేశారా లేదా అని పంట పొలాలను సందర్శించి రైతులను అడిగి తెలుసుకొన్నారు. రైతులతో మాట్లాడుతూ పంట నమోదు ద్వారా పంట రుణం, విత్తనాలు, ఎరువులు, పంటనష్ట పరిహారం బీమా, మార్కెట్‌శాఖ పరంగా రైతులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. సర్పంచ్ చంద్రారెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ



వెలుగోడులో ర్యాలీ

వెలుగోడు, ఫిబ్రవరి 5: వెలుగోడు పట్టణంలో రోడ్డు సేఫ్టీ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం ప్రేరణ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఐ హుస్సేన్‌బాషా మాట్లాడుతూ రహదారి నియమాలు, సూత్రాలు పాటించాలని, తెలియచేశారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో నడపాలని అతివేగం ప్రాణాలకు ముప్పు అని ముఖ్యంగా నేటి యువత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 5: నంద్యాల పట్టణంలో వెలసిన భీమేశ్వర దేవస్థానం(మూలమట్టం) ఆలయ నూతన ధర్మకర్తల పాలక మండలికి దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈవో టి.రామాంజనేయశర్మ తెలిపారు. సోమవారం ఈవో మాట్లాడుతూ జిల్లా దేవాదాయ శాఖాధికారి నోటిఫికేషన్ జారీ చేశారని, ఆసక్తికల వారు ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు 30 ఏళ్లు పైబడిన వారు అర్హులని చెప్పారు. తమ దరఖాస్తులను నంద్యాలలోని రైతునగరంలో జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఈవో తెలిపారు.

'అక్రమ రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలు'

రుద్రవరం, ఫిబ్రవరి 5: ఎదురు లేని వెదురు రవాణా అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి రుద్రవరం సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి సోమవారం స్పందిస్తూ వెదురు అక్రమ రవాణాకు సిబ్బంది సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటువంటి వారిపై నిఘా పెట్టామని, విచారణలో తేలితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. చెలిమ రేంజ్‌లో గ్రీన్ కారిడార్ ఉందన్నారు. పెద్దపులుల సంచారం ఉందని అన్నారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఇంటికి పంపుతామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లాలో 29 కుష్ఠు వ్యాధి కేసులు: డీపీఎం

చాగలమర్రి, ఫిబ్రవరి 5: జిల్లాలో 29 కుష్ఠువ్యాధి కేసులు నమోదైనట్లు డీపీఎం ప్రసాద్ తెలిపారు. సోమవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. కుష్ఠువ్యాధికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా బాలికలకు కుష్ఠువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. స్పర్శవ్యాధి లక్షణాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈనెల 13వ తేదీ వరకు కుష్ఠువ్యాధి నిర్మూలన అవగాహన సదస్సులు జరుగుతాయని అన్నారు. లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఎం విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, మనోహర్, ఆశా వర్కర్ శివలక్ష్మి పాల్గొన్నారు.

'వైసీపీకి పతనం తప్పదు'

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 5: త్వరలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి పతనం తప్పదని టీడీపీ నాయకుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్లలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల అవసరా లను తుంగలో తొక్కడమే గాక రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని, చివరకు రాజధాని లేకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా 2024లో వైసీపీకి ఈ ఎన్నికల్లో పతనం తప్పదన్నారు.

క్షుద్రపూజల కలకలం

రుద్రవరం, ఫిబ్రవరి 5: మండలంలోని ముత్తులూరు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల పక్కనే ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు సోమవారం ఉదయం స్థానికులు గుర్తించారు. పాఠశాల పక్కనే ముగ్గులు వేసి నిమ్మకాయలు పెట్టి క్షుద్రపూజలు చేయడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికి నాలుగుసార్లు ఇలా జరిగిందని గ్రామ ప్రజలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 5: పట్టణ శివార్లలోని ఏపీ గోదాముల వద్ద 40వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల నుంచి అన్నమయ్య జిల్లాకు వెళ్తున్న బొలెరో వాహనం డివైడర్‌ను ప్రమాదవశాత్తు ఢీ కొనడంతో డ్రైవరు సయ్యద్‌హుసేన్, మూలాబాషా తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి'



వైద్యురాలికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 5: పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. స్థానిక పట్టణంలోని గౌరిపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ దగ్గర డా. గాయత్రి తస్నెకి వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య, ఆశా వర్కర్ల పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ మాట్లాడుతూ ఆశాల కనీస వేతనం ఇవ్వాలని, వారిపై పనిభారం తగ్గించాలని, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. అలాగే ఆశాల నియామకాల్లో రాజకీయ నాయకుల జోక్యం తగ్గించి, ప్రభుత్వమే నియామకాలు జరపాలని కోరారు. ఈ డిమాండ్ల పైన ఈ నెల 8న చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

బేతంచెర్ల, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరుగుతన్న ధరలకు అనుగుణంగా వేతనం రూ.26వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, మండల కార్యదర్శి రహంతుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎంఈవో సోమశేఖర్‌కు మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికులు 20 సంవత్సరాల నుంచి విద్యార్థులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఐటీయూ నాయకులు రాజాబాబు, నరసింహులు, మధ్యాహ్న భోజన కార్మికులు రుక్మిణమ్మ, శారద, కృష్ణ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

డోన్(రూరల్), ఫిబ్రవరి 5: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజాము సమయంలో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. కారులో తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుబడింది. ఈ మేరకు సోమవారం రాత్రి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. డోన్ పట్టణ సమీపంలోని హైవే రోడ్డు మీదుగా పట్టణ పోలీసు సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా.. అనంతపురం వైపు వెళ్తున్న కారులో ముగ్గురు వ్యక్తులు 30 మద్యం బాక్సులతో పట్టుబడ్డారని చెప్పారు. ఒక్కో బాక్సులో 96 కర్ణాటకకు చెందిన టెట్రా మద్యం ప్యాకెట్లు లభించాయన్నారు. మొత్తం 30 మద్యం బాక్సులలో 2,880 టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వీటి విలువ రూ.1,27,500 విలువ ఉంటుందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి ఈ సరుకును కొనుగోలు చేసి అనంతపురం జిల్లా తాడిపత్రి తదితర ప్రాంతాల్లో అమ్ముకునేందుకు కారులో వెళ్తున్న డోన్ పట్టణానికి చెందిన మహబూబ్ వలి, సిరాజ్, రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన షాలి సాహెబ్ నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం గ్రామ సమీపంలోని చెట్టుకింద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావటంతో అక్కడి వెళ్లి చూడగా అతని వద్ద 15 మద్యం బాటిళ్లు ఉన్నాయని చెప్పారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

బనగానపల్లె, ఫిబ్రవరి 5: మండలంలోని తమ్మడపల్లె గ్రామానికి చెందిన ఎద్దుల బాలతిమ్మయ్య(40) మృతికి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి బీసీ రాజారెడ్డి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు.



నివాళి అర్పిస్తున్న బీసీ రాజారెడ్డి

అరాచక పాలనలో దగా పడుతున్న బీసీలు: టీడీపీ

రుద్రవరం, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వ అరాచకపాలనలో బీసీలు దగాపడుతున్నారని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం రుద్రవరం వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించిన బీసీ జయహో సదస్సులో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.75వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగన్ వద్ద ఫొటోలు దిగడం తప్ప ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. బీసీలపై దాడులు చేయడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మా బీసీలని అంటూనే వారిని అణగదొక్కిందన్నారు. బీసీలకు న్యాయం గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిందని, ఆ ఘనత చంద్రబాబుకే సాధ్యం అన్నారు. 50వేల పోస్టులు ఖాళీగా ఉంటే ఈ ప్రభుత్వం భర్తీ చేయడానికి ముందుకు రాలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వచ్చిన పారిశ్రామికవేత్తలు ఈ రాష్ట్రం నుండి పరారయ్యారన్నారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 70 మంది బీసీలను హత్య చేసి, 3వేల మందిని క్షతగాత్రులను చేసిన దుర్మార్గం ఈ ప్రభుత్వానిదని అన్నారు. జగన్ ప్రభుత్వంలో బీసీలను వేధిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు నారాయణ, రంగనాయకులు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మల్లికార్జున, రామక్రిష్ణ, శ్రీరాములు, బీసీ సెల్ తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, బాలరాజు, బాలసుబ్బయ్య, యువరాజు, ఫక్కీరయ్యగౌడ్, చంద్రశేఖర్, కాంత్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరంలో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ



అవుకులో అభివాదం తెలుపుతున్న నాయకులు

అవుకు: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే లక్ష్యంగా బీసీలు పనిచేయాలని టీడీపీ బీసీ సాధికార సమితి కన్వీనర్ నాగేశ్వరరావుయాదవ్ పిలుపునిచ్చారు. అవుకు పట్టణంలోని మండపం వీధిలో సోమవారం 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ నాయకులు వలసల రామకృష్ణ, జిల్లెల్ల శ్రీరాములు, గడ్డం రామకృష్ణారెడ్డి, మల్లికార్జుననాయక్, భూషన్న తదితరులు హాజరయ్యారు. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలను అణగదొక్కింని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 30శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24శాతానికి తగ్గించి వైసీపీ ప్రభుత్వం బీసీలను వంచించిందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం అక్రమాలను ఎదిరించినందుకు 77 మంది బీసీలు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 2,240 మంది దాడులకు గురయ్యారన్నారు. 2600 మందిబీసీలపై అక్రమ కేసులు వైసీపీ ప్రభుత్వం బనాయించిందని ఆరోపించారు. వైసీపీ నాయకులు 14 లక్షల అసైన్డు భూములు కబ్జా చేశారని, అందులో అత్యధిక భాగం బీసీలవే ఉన్నాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 30 పథకాలను సీఎం జగన్ రద్దు చేసి బీసీల నడ్డి విరిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు దంతెల రమణ, మల్లికార్జుననాయక్, తిక్కన్న, జగన్, ఓబులేసు, జయశివుడు, తిరుమలనాయక్, వెంకటరాముడునాయక్, షేక్షావలి, సిద్దు, మంగంపేట శ్రీనివాసులు, వేములపాడు గురప్ప, బాలనాయుడుతో పాటు సీనియర్ నాయకులు ఐవీ ఫక్కీర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఇది సంక్షోభ రాష్ట్రం: బీసీ



డోన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 5: పన్నుల బాదుడుతో రాష్ట్ర ప్రజల రక్తం పీలుస్తూ, మాయమాటలు చెప్తున్న సీఎం జగన్ వల్ల ఏపీ సంక్షోభ రాష్ట్రంగా మారిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం పలుకూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటి ప్రచారం గావించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లు రద్దు చేసి, పండుగ కానుకలు, చంద్రన్న బీమావంటి పెళ్లి కానుకలు, ఫీజు రీయంబర్స్‌మెంట్, రైతులకు సబ్సిడీ రుణాలు, దళిత, బీసీ, ఎస్సీల సంక్షేమ పథకాలు వందకు పైగా రద్దు చేశారన్నారు. జగన్‌ను రాష్ట్ర ప్రజలు రెండు నెలల్లో ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, చల్లామద్దిలేటి, గుండం మల్లికార్జున రెడ్డి, మండ్ల కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి వల్లపుశంకర్, జిల్లెల్ల వెంకటరామిరెడ్డి, గగ్గెర అరుణ, మాసన్న గౌడ్, ఉప్పరి గురువయ్య అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

బనగానపల్లె, ఫిబ్రవరి 5: బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్లకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కొలిమిగుండ్లకు చెందిన ఉలువల రామలక్ష్మయ్య, ఉలువల నరసింహులు, ఉలవల బాలన్న, వెంకట్రాములు, దేవరకొండ వన్నూరప్ప, తలారి కంబగిరి, తలారి సూర్యనారాయణ, తలారి నాగార్జున, 5వ వార్డు సభ్యురాలు మాధవి, ఆయన భర్త సూర్యుడుతో పాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మాజీమంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం రుద్రవరంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో



పలుకూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ



చాగలమర్రిలో పాల్గొన్న నాయకులు

కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వం టీడీపీ, కాబోయే సీఎం చంద్రబాబునాయుడేనని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుగు చెందారని అన్నారు.

● మండలంలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో ఉత్తమ సభ్యులుగా గుర్తించిన టి.లింగందిన్నె గ్రామానికి చెందిన ఓబులేసు, రుద్రవరం గ్రామానికి చెందిన దస్తగిరిలకు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పతకాలు అందించారు.

చాగలమర్రి: రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని కుమ్మరి వీధిలో 212 పోలింగ్ కేంద్రం పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టీడీపీ అధికారం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్.మహబూబ్, ఖాజా, రవి, మహిళలు పాల్గొన్నారు.

డోన్: వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా యువతను వంచించిదని డోన్ నియోజకవర్గ యువనాయకుడు ధర్మవరం భరత్‌రెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గంధం శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలోని 23వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తానని జగన్ మాటిచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. గంధం శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం జగన్ నోటిఫికేషన్ల పేరుతో కొత్త డ్రామా అడుతున్నారని, యువత నమ్మే పరిస్థితి లేరని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నీలం ప్రభాకర్, ఎల్ఐసీ శ్రీరాములు, నాగేంద్ర, గంధం చరణ్ పాల్గొన్నారు.

అహోబిలేశుడికి పూజలు



ఆళ్లగడ్డలో పూజలు చేస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 5: ఆళ్లగడ్డలోని పాత మసీదు ప్రాంతంలోని అహోబిలం మఠం వారి తెలుపు వద్ద సోమవారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకికి ప్రధాన అర్చకులు వేణు గోపాలన్, సంపత్, ప్రత్యేక అధికారి శివప్రసాదరావు పూజలు చేశారు. అనంతరం రంగరాజ వగైరా సుబ్బారావు, కరణం శ్రీను, రాజ సుబ్బ రాయుడు, బాలాజి, పాలూరి లక్ష్మీనరసయ్య, పురోహితుల వెంకట రామయ్య, వెంకటాద్రిరావు, ఈడిగ రామయ్య తెలుపుల వద్ద ఉత్సవ పల్లకీ లోని ప్రహ్లాద వరదస్వామి, జ్వాలా నరసింహస్వామి పూజలందుకున్నారు.

యాగంటిలో పల్లకీ సేవ

బనగానపల్లె, ఫిబ్రవరి 5: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

'రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 5: మండలంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీటీ విజయ్‌కుమార్ సూచించారు. సర్వర్ డౌన్ అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన డీటీ విజయ్‌కుమార్ సంతమార్కెట్‌లోని సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీనివాసులు, బాబయ్య, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 5: ఆళ్లగడ్డలో కళాకారుల శిక్షణ కోసం స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులును కోరినట్లు ఆళ్లగడ్డ నాయి బ్రాహ్మణుల సంఘం నాయకుడు బాలనరసింహులు తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై కలెక్టర్, ఆర్డీవో సానుకులంగా స్పందించారన్నారు.

పాత పెన్షన్ కోసం పోస్టు కార్డు ఉద్యమం



ప్యాపిలిలో కార్డులను పోస్టులో పంపుతున్న నాయకులు

ప్యాపిలి, ఫిబ్రవరి 5: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో ఉపాధ్యాయులు పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు రాష్ట్రంలోని నాలుగు ప్రధాన పార్టీలకు ఈ కార్డులను పంపినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

డోన్(రూరల్): సీపీఎస్ రద్దును మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. సీపీఎస్ రద్దును అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని ఆయన కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, మండల నాయకులు గోసాల్, సంజీవరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

దొర్నిపాడు, ఫిబ్రవరి 5: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో ఆది అల్లూరి ఎరుకలిస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా నిర్వహించిన భజన పోటీల కార్యక్రమంలో శంకరాపురం భజన బృందం మొదటి బహుమతి కైవసం చేసుకున్నట్లు కమిటీ సభ్యులు సిద్ధి సత్యనారాయణ, పగిడెల బాలిరెడ్డి, బత్తుల శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఈ పోటీలో మొదటి బహుమతి శంకరాపురం భజన బృందానికి రూ.20 వేలు, రెండో బహుమతి మారూరు భజన బృందానికి రూ.15వేలు, మూడో బహుమతి లక్ష్మీపల్లె భజన బృందానికి రూ.12 వేలు అందించారు. నాలుగో బహుమతి ఉయ్యాలవాడ భజన బృందానికి రూ.10 వేలు, ఐదో బహుమతి వెంకటాయపల్లెకు రూ.9 వేలు, ఆరో బహుమతి తిరుపేలుదిన్నెకు రూ.6 వేలు అందించారు. అలాగే ఏడో బహుమతి గుర్రంపాడుకు రూ.5 వేలు, ఎనిమిదో బహుమతి కోచివారిపల్లెకు రూ.4 వేలు, తొమ్మిది బహుమతి కంపమల్లేకు రూ.3 వేలు, పదో బహుమతి పెట్టికోటకు రూ.2 వేలు, పదకొండో బహుమతి చిన్నకొప్పెర్ల భజన బృందానికి రూ.1,500 అందించారు. కమిటీ సభ్యులు సిద్ధి సత్యనారాయణ, పగిడెల బాలిరెడ్డి, దూదెకుల దస్తగిరి, శ్రీనివాసయాదవ్, అక్కుల గోపాల్, గోర్ల నాగయ్య, పగడాల శీలయ్య అందజేశారు. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గరికపాటి రాజారావు జయంతి

బనగానపల్లె, ఫిబ్రవరి 5: బనగానపల్లె సీపీఐ కార్యాలయంలో సోమవారం గరికపాటిరాజారావు 109వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ గరికపాటి రాజారావు వైద్యుడుగా, నటుడిగా రచయితగా, దర్శకుడిగా ఎంతో మంది ఉత్తమ నటులను తయారు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అఖిల భారత ప్రజానాట్య మండలిని స్థాపించి ప్రజాచైతన్యం చేసిన గొప్ప మనిషి అన్నారు. సంజీవులు, సుబ్బారెడ్డి, శివబాలకృష్ణ, శివనాగయ్య, ఎర్రిస్వామి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో

డోన్(రూరల్), ఫిబ్రవరి 5: డోన్ ఆర్డీవోగా మహేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్డీవోగా పని చేస్తున్న వెంకటరెడ్డి నగరికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా వీరపల్లి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న మహేశ్వరరెడ్డి పదోన్నతిపై డోన్ ఆర్డీవోగా వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. అలాగే డోన్ మున్సిపల్ కమిషనర్‌గా జయరామ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ వెంకట్రామిరెడ్డి నందిగామ జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈయన స్థానంలో జయరామ్ మున్సిపల్ కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు.



మహేశ్వరరెడ్డి

చికిత్స పొందుతూ మహిళ మృతి

సంజామల, ఫిబ్రవరి 5: మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో గొల్లపల్లె హరిప్రియ (31) చికిత్స పొందుతూ మృతి చెందారు. సంజామల ఏఎస్ఐ నాగరాజు సోమవారం తెలిపిన వివరాలివీ.. హరిప్రియ రెండు రోజుల క్రితం ఇంటి వద్ద పురుగుల పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆమెను బంధువులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. బనగానపల్లె మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన హరిప్రియకు పదేళ్ల క్రితం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన హరిముకుందరెడ్డితో వివాహమైంది. భర్త తాగుడుకు, చెడు వ్యసనాలకు బానిసై నిత్యం హరిప్రియను వేధిస్తుండేవాడు. జీవితంపై విరక్తి చెందిన మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. మహిళకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి హరిప్రియ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. హరిప్రియకు తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు.

'ఆ స్థలాలు ఇవ్వొద్దు'

డోన్(రూరల్), ఫిబ్రవరి 5: డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామ సమీప కొండ పరిసర ప్రాంతాల్లో మూగ జీవాలకు వదిలిన స్థలాలను ఇళ్ల స్థలాల కోసం ఇవ్వొద్దని డోన్ మండల టీడీపీ అధ్యక్షుడు, వెంకటనాయునిపల్లి శ్రీనివాసులు యాదవ్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ శతాబ్దాల నుంచి వెంకటనాయునిపల్లె గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు పశువులు, మేకలు, గొర్రెలను కొండ పరిసర ప్రాంతాల్లో మేపేందుకు వదులుతున్నారని చెప్పారు. మూగజీవాలను పోషిస్తూ ఎన్నో కుటుంబాలు వాటిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అయితే.. రెవెన్యూ అధికారులు ఇక్కడ నివాస స్థలాలకు యోగ్యంగా ఉందని, ఇంటి పట్టాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. ఇటువంటి ప్రయత్నాలను మానుకోవాలని, లేనిపక్షంలో వాటిపై న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు'

బేతంచెర్ల, ఫిబ్రవరి 5: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని, ఒకవేళ ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రియతమ్ రెడ్డి హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల దృష్టిలో పెట్టుకుని బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక గ్రామమైన సిమెంటునగర్‌లో పట్టణ సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ఆయా పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాల నివారణపై, అలాగే మహిళలు, బాలబాలికలపై చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ భేగ్, పీసీ సుబ్బరాయుడు, గ్రామ పెద్దలు యాకోబు, రాముడు, బండి కుమార్, సత్యం, నాగరాజు, పాల్గొన్నారు.

ఉజ్జీవ స్వస్థత సభలు ప్రారంభం

డోన్(రూరల్), ఫిబ్రవరి 5: డోన్ పట్టణం వెంకటనాయునిపల్లె రోడ్డులో ఉన్న మైదానంలో సోమవారం రాత్రి ఉజ్జీవం సువార్త స్వస్థత సభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉజ్జీవ స్వస్థత సభలు భారతదేశం గురించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డోన్ డివిజన్ పాస్టర్స్ హెల్పర్స్ అసోసియేషన్ నిర్వహకులు నిత్యానందం పాల్గొన్నారు. పాస్టర్ ప్రవీణ్ సిస్టర్ శారోన్ పాల్గొని ప్రజల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'ఘర్షణలకు పాల్పడితే చర్యలు'

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 5: వచ్చే ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ సీఐ హనుమంతనాయక్ హెచ్చరించారు. ఆళ్లగడ్డ మండలం లోని అహోబిలం గ్రామస్థులతో సోమవారం సమావేశాన్ని రూరల్ ఎస్ఐ నరసింహులు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసు అధికారుల దృష్టికి తీసుకరావాలే తప్ప ఘర్షణలకు పాల్పడరాదని సూచించారు అహోబిలం గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 5: మాయలూరు గ్రామ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేపట్టి సరియైన పత్రాలు, లైసెన్స్‌లు లేని 10 మందిపై కేసు నమోదు చేసి వారికి రూ. 4 వేలు జరిమాన విధించామని ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

'హిందూ ధర్మాన్ని కాపాడాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 5: ప్రతి ఒక్కరు హిందూ ధర్మాన్ని కాపాడాలని శివరామానంద ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి అన్నారు. సోమవారం రాత్రి చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో ధర్మాప్రచార కరపత్రాలను ఎస్ఎస్ఎఫ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ ఆయన మాట్లాడుతూ ధర్మాప్రచారం అందరి బాధ్యత అన్నారు. ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మాప్రచార ప్రతినిధి శ్రీనివాసులు, జిల్లా సహ కన్వీనర్ సల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, బాల వికాస్ కేంద్ర మాతాజీ శకుంతల, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'

దొర్నిపాడు, ఫిబ్రవరి 5: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు మెమెంటోలు అందించి అభినందించారు. గెలుపొందిన విద్యార్థులను పీఈటీలు, సచివాలయ సిబ్బంది, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు అభినందించారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

చాగలమర్రి, ఫిబ్రవరి 5: చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో వెలసిన దస్తగిరిస్వామి దర్గా వద్ద సోమవారం ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద ముస్లింలు అధిక సంఖ్యలో వెళ్లి ఫాతెహాలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఫాతెహాలు చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.